ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 06.07.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న అటవీ శాఖ భూముల్లో పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
2. ప్రపంచ వ్యాప్తంగా ఫార్మా రంగంలో హైదరాబాద్‌కు ఉన్న బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకుంటూ, రాష్ట్రంలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు.
3. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు వదలకుండా ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతున్నదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు విమర్శించారు.
4. రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు బలమైన ఈదురు గాలుతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

**సీఎం-పర్యాటక శాఖ రివ్యూ**

హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో తలపెట్టిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి నిర్దేశించుకున్న పనులను వేగవంతం చేయడానికి పర్యాటక శాఖపై ఈరోజు ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని

ముఖ్యమంత్రి చెప్పారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో ఎకో పార్కులుగా తీర్చిదిద్దాలని సూచించారు. నగరంలోని పర్యాటక ప్రాంతాలను మరింతగా తీర్చిదిద్దాలని , తారామతి బారాదరి మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని చెప్పారు.

డెస్క్

**పొంగులేటి, శ్రీధర్ బాబు**

ప్రపంచవ్యాప్తంగా ఫార్మా రంగంలో హైదరాబాద్‌కు ఉన్న బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకుంటూ , రాష్ట్రంలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా , మార్కుక్ మండలంలోని బయోటెక్ పార్క్ ఫేజ్- III లో 'సిరో ఫార్మా ' ఆధ్వర్యంలో నిర్మించిన అత్యాధునిక క్యాన్సర్ ఔషధాల తయారీ కేంద్రాన్ని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ... ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న క్యాన్సర్ మహమ్మారి నివారణకు మన రాష్ట్రం నుంచే పరిశోధనలు, ఔషధాల తయారీ చేపట్టడం గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేశారు.

డెస్క్

కన్నెపల్లి- కేటీఆర్

కన్నెపల్లి పంప్ హౌస్‌లో రెండు పంపులు స్టార్ట్ చేస్తే తెలంగాణ సుభిక్షం అవుతుందని చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు విమర్శించారు. కాళేశ్వరం వద్ద లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని , తమ పార్టీపై కోపంతో రైతులను వేధించవద్దని హితవు పలికారు. హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లో జరిగిన 18వ హమాలీ యూనియన్ మహాసభకు తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

డెస్క్

కాళేశ్వరం-మంత్రి వివేక్

కాళేశ్వరం ప్రాజెక్టులో గత బిఆర్ ఎస్ ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని రాష్ట్ర కార్మిక , గనుల శాఖా మంత్రి వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. మంచిర్యాల జిల్లా , బొక్కల గుట్టలో పర్యటించిన మంత్రి ఆకాశవాణితో మాట్లాడుతూ ... గత పాలకుల నిర్లక్ష్యం వల్లనే కాళేశ్వరం ప్రాజెక్టులో పిల్లర్లు కుంగిపోయాయని అన్నారు. కమిషన్ల కోసమే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని విమర్శించారు.

బైట్ ... వివేక్ వెంకటస్వామి, మంత్రి

పిటిసి, మంచిర్యాల

డీజీపీ-కొత్తగూడెం

ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా పని చేయాలని, శాంతి భద్రతలను పరిరక్షించాలని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ పోలీసులు సిబ్బందిని ఆదేశించారు. వేగవంతమైన సేవలు అందించేందుకు ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని డీజీపీ ఈరోజు ప్రారంభించారు. గంజాయి రవాణా , డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు.

బైట్ ... సి.వి. ఆనంద్, డీజీపీ

పిటిసి, భద్రాద్రీ కొత్తగూడెం

జూపల్లి

నాగర్ కర్నూల్ జిల్లాలో ఫైళ్లను అనవసరంగా పెండింగ్‌లో పెడుతూ ప్రజలను ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పడంపై రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో దీర్ఘకాలంగా ఉన్న రెవెన్యూ , అటవీ, భూ సమస్యలపై ఆర్డీఓ కార్యాలయంలో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పీటీసీ, నాగర్ కర్నూల్

రాంచందర్ రావు-కాళేశ్వరం

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై బీఆర్ఎస్ , కాంగ్రెస్ పార్టీలు రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. డ్యాం భద్రతపై ఎన్‌డీఎస్ఏ స్పష్టత ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం రిపేర్ పనులు ప్రారంభించలేదని , గత ప్రభుత్వ అవినీతిపై కఠిన చర్యలు తీసుకోకుండా నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకుందని ఆరోపించారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ... హైదరాబాద్‌లో HYDRAA పేరుతో కేవలం పేదవాళ్ల ఇళ్లను నిర్ధాక్షిణ్యంగా కూలగొడుతున్న ప్రభుత్వం.. MIM పార్టీకి చెందిన అక్రమ కట్టడాల జోలికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు.

పీఎన్

పొన్నం ప్రభాకర్

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం భవిష్యత్తులో అభివృద్ధిలో మరింత ముందంజలో నిలుస్తుందని రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి జంక్షన్ వద్ద మడిపల్లి నుంచి ఎల్కతుర్తి జంక్షన్ వరకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 13 కోట్ల రూపాయలతో చేపట్టిన బీటి రోడ్డు నిర్మాణ పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు.

పీటీసి, వరంగల్

సిరిసిల్ల-ఎస్పీ

విధినిర్వహణలో సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని , రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బీ గీతే అన్నారు.

వర్షాకాలం దృష్ట్యా  సిబ్బందికి ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో రెయిన్ కోట్లను పంపిణీ చేశారు.  పోలీస్ సిబ్బంది ప్రజల రక్షణ కోసం 24 గంటలూ కష్టపడుతుంటారని, వారి సంక్షేమం ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్నారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల

మెదక్ -కలెక్టర్

స్వచ్ఛ కలెక్టరేట్, అందరి బాధ్యత అని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ అన్నారు. వ్యర్థాలు సక్రమంగా వేరు చేసి కలెక్టర్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా స్వచ్ఛ మెదక్ తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రజలు కంకణబద్ధులై పని చేయాలన్నారు.

పీటీసీ, మెదక్

ఎంపీ డీకే అరుణ

గ్రామాల సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని   , కేంద్ర నిధులతోనే గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందని ఎంపీ డి.కె. అరుణ అన్నారు. నారాయణపేట జిల్లా బోయిన్‌పల్లి గ్రామంలో సీసీ రోడ్లు, హైమాస్ట్ లైట్లను ఎంపి ప్రారంభించారు.

(పీటీసీ, Mahabubnagar)

వాతావరణం

రాష్ట్రంలో రాబోయే   మూడు రోజుల పాటు అక్కడక్కడ పాటు బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల , కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

డెస్క్

**టీజేఎస్**

రాష్ట్ర విభజన సమయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం మండలంలోని 5 గిరిజన గ్రామపంచాయతీలను అశాస్త్రీయంగా ఆంధ్రప్రదేశ్ లో కలపడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే తిరిగి తెలంగాణలో కలపాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్ రావు , కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు మూల నాగిరెడ్డి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ విషయంపై సత్వరమే సమావేశమై ఆ 5 గ్రామ పంచాయతీలను ఆంధ్రా నుంచి తెలంగాణకు బదిలీ చేయాలని కోరారు.

పీఎస్

ఎయిర్ పోర్ట్

సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ తక్కువ ధరల విమానయాన సంస్థ 'ఫ్లైడీల్' - flyadeal భారతీయ మార్కెట్లోకి అధికారికంగా ప్రవేశించింది. హైదరాబాద్ –రియాద్ మార్గంలో ప్రారంభమైన ఈ తొలి విమాన సర్వీసుకు జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఘన స్వాగతం పలికింది.

పీఎస్

మంచిర్యాల- జూనోసిస్

పెంపుడు శునకాలు, పిల్లులకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల పట్టణంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత రేబిస్ టీకాల కార్యక్రమానికి జిల్లా పశు వైద్య , పశుసంవర్ధక శాఖ అధికారి డా. యాకూబ్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు.

పీటీసీ, మంచిర్యాల